సాక్షి నల్లగొండ

బుధవారం : 28 : జూన్ : 2023



దేవరకొండలో వ్యక్తి హత్య

దేవరకొండ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హత్యకు గురయ్యాడు. - 8లో



కూరగాయల సాగుతో లాభాలు

కూరగాయల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35° / 26°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.70,01,240



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు విచ్చేసి స్వామి వారికి మొక్కుబడిగా 90 రోజుల్లో సమర్పించిన కానుకల హుండీలను మంగళవారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.70,01,240, అన్నదాన హుండీ ద్వారా రూ.66,080 సమకూరినట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ వెల్లడించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ మహేంద్రకుమార్, డివిజన్ పరిశీలకురాలు వెంకటలక్ష్మి పర్యవేక్షణలో హుండీలను లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రామలింగేశ్వరశర్మ, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



దామరచర్ల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ : అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు, ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. నిత్యం పెరుగుతున్న ఇటుక, సిమెంట్, ఇసుక ధరలతో పేదలు ఇళ్లు కట్టుకోలేని స్థితి ఏర్పడిందని.. పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లేష్, మండల కార్యదర్శి వినోద్‌నాయక్, పాపానాయక్, ఎర్రనాయక్, దయానంద్, పాక గోపి, బాలసైదులు, ఖాజామోహిదిన్, శ్రీను నాయక్, కోటిరెడ్డి, దుర్గయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

'డిండి' పనుల పరిశీలన



డిండి ప్రాజెక్టు వద్ద గేటు పనులను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

డిండి : డిండి ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువ ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేసే తూములకు నూతనంగా ఏర్పాటు చేసే తలుపుల పనులను మంగళవారం జలవనరుల శాఖ ఎస్‌ఈ వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఎస్‌ఈ సమక్షంలో తూముల పాత తలుపులను క్రేన్ సహాయంతో బయటికి తీశారు. స్థానిక నీటి పారుదల శాఖా అతిథి గృహంలో తలుపుల తయారీకి ఉపయోగిస్తున్న మెటీరియల్‌ను పరిశీలించి పనుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ పది రోజులలోపు తలుపుల ఏర్పాటు పనులు పూర్తవుతాయన్నారు. ఆయన వెంట ఈఈ శ్రీధర్‌రావు, డీఈ శ్రీనివాసులు, ఏఈ ఫయాజ్ తదితరులున్నారు.

జూలై 2 వరకు దరఖాస్తులు

నల్లగొండ : సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్ష కోసం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన స్టడీసర్కిల్‌లో ఉచిత శిక్షణ పొందడానికి జూలై 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 2,300 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రాత పరీక్షను హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్‌లో జూలై 9వ తేదీన నిర్వహిస్తామని, ఈ పరీక్ష ఆధారంగా వందమందిని ఎంపిక చేస్తామని అందులో 75 సీట్లు షెడ్యూల్డ్ కులాల వారికి, 15 సీట్లు వెనుకబడిన తరగతుల వారికి, 10 సీట్లు షెడ్యూల్డ్ తెగల వారికి కేటాయించినట్లు తెలిపారు. సీట్లలో 33.33% మహిళలకు, 5% వికలాంగులకు రిజర్వ్ చేశామని పేర్కొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణంలో రూ.కోటి స్వాహా!

- చింతపల్లి మండలంలో బిల్లులు కాజేసిన అధికారులు
- నిర్మాణదారులకు బిల్లు ఇవ్వకుండానే ఇచ్చినట్లు ఆన్‌లైన్‌లో నమోదు
- ఒక విడత చెల్లించి.. మరో విడత నొక్కేసిన వైనం
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు



చింతపల్లిలో నిర్మించుకున్న మరుగుదొడ్డి



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి చనమోని మహేశ్. చింతపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో 2019 సంవత్సరంలో స్వచ్ఛ భారత్ కింద తన సొంత ఖర్చుతో మరుగుదొడ్డి నిర్మించుకున్నాడు. మరుగుదొడ్డి పూర్తయిన తర్వాత పలుమార్లు అధికారులను సంప్రదించినా బిల్లు రాలేదని చెప్పారు. అప్పటి నుంచి అధికారులను అడగడం మానేశాడు. తాజాగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద మరుగుదొడ్డి బిల్లులు ఇస్తున్నారన్న సమాచారంతో కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ అధికారులు పేర్లు పరిశీలించగా అప్పటికే రూ.12 వేలు మహేశ్‌కు ఇచ్చినట్లు ఉందని తెలిపారు. దీంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని మహేశ్ వాపోయాడు.

చింతపల్లి : మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసే బిల్లుల్లో అధికారులు చేతివాటం ప్రదర్శించారు. ఆన్‌లైన్‌లో లబ్ధిదారులకు బిల్లు చెల్లించినట్లుగా చూపించి.. ఏకంగా సుమారు రూ.కోటికి పైగా స్వాహా చేశారు. చింతపల్లి మండలంలో అధికారులు మరుగుదొడ్ల బిల్లుల్లో మొదటి విడత చెల్లించి.. రెండో విడతలో మొండి చేయి చూపించారు. మరి కొందరికి అసలు బిల్లులే చెల్లించలేదు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులు వాటిని పంచుకు తిన్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిధులు స్వాహా చేసినట్లు తెలియడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

రూ.6వేల చొప్పున రెండు విడతల్లో..

స్వచ్ఛ భారత్ మిషన్ కింద చింతపల్లి మండలంలోని 34 గ్రామాల్లో 3,874 మందిని మరుగుదొడ్లు లేనివారిని లబ్ధిదారులుగా గుర్తించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి రెండు విడతల్లో రూ.6వేల చొప్పున రూ.12 వేలను లబ్ధిదారుడికి ప్రభుత్వం అందిస్తుంది. మరుగుదొడ్డి నిర్మాణ దశలను ఫీల్డ్ అసిస్టెంట్లు తనిఖీ చేసి నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్డి వద్ద లబ్ధిదారుడిని ఉంచి ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. తర్వాత పంచాయతీ కార్యదర్శి, సంఘబంధం అధ్యక్షురాలు, సర్పంచ్ సంతకం చేసి పరిశీలించి రెండు విడతల్లో రూ.6 వేల చొప్పున లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తారు. మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి అయిన తర్వాత ఫీల్డ్ అసిస్టెంట్లు ధ్రువీకరణ అనంతరం గ్రామపంచాయతీ ఖాతాలో డబ్బులు జమ చేస్తారు. ఈ వెసులుబాటును అవకాశంగా చేసుకుని అంతా కుమ్మక్కై బిల్లులు కాజేశారని ఆరోపణలు వస్తున్నాయి.

అక్రమాలకు తెరలేపిన అధికారులు..

మరుగుదొడ్ల బిల్లులు బిల్లు ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా ఉండడం ఏమిటని అధికారులను ఇటీవల కొందరు లబ్ధిదారులు నిలదీయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. 2018 సంవత్సరంలో మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు 2019లోపే కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించింది. అయితే మొదటి విడత రూ.6 వేలు లబ్ధిదారులకు ఇచ్చి, మరో రూ.6 వేలు కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మింగేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు అనుకూలంగా ఉన్న వారు మరుగుదొడ్లు నిర్మించుకోకున్నా నిర్మాణం జరిగినట్లుగా ఆన్‌లైన్ చేసి నిధులు స్వాహా చేశారని తెలుస్తోంది. పలు గ్రామాల్లో సొంతంగా మరుగుదొడ్లు నిర్మించుకున్న వారి సొమ్మును సైతం మింగేశారు. అసలైన లబ్ధిదారులు డబ్బుల గురించి అడిగితే ఆర్థిక సంవత్సరం ముగియడంతో నిధులు మురిగిపోయాయని చెబుతూ వస్తున్నారు.

పైసా ఇవ్వలేదు



స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా నా తల్లి పిల్లి యాదమ్మ పేరు మీద 2019లో మరుగుదొడ్డి నిర్మించుకున్నా. ఇందుకు సంబంధించి బిల్లు ఇవ్వాలని ఎన్నిసార్లు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులను కలిసినా పట్టించుకోవడం లేదు. మరుగుదొడ్డి నిర్మించుకొని నాలుగేళ్లు కావస్తున్నా పైసా ఇవ్వలేదు. ఉన్నతాధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలి.

– పిల్లి లింగం, చింతపల్లి

బిల్లులు ఇప్పించేలా చూస్తాం

మరుగుదొడ్డి నిర్మించుకొని బిల్లు అందని కొందరు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా మరుగుదొడ్డి నిర్మించుకుని బిల్లులు పొందని వారిని ఏపీఓను సంప్రదించాలని సూచించాం. బిల్లులు అందని వారికి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

– రాజు, ఎంపీడీఓ, చింతపల్లి

బిల్లులు అందలే..

చింతపల్లి మండల కేంద్రంలోనే 180 మంది లబ్ధిదారులకు మొదటి విడత బిల్లు రూ.6 వేలు అందగా.. రెండో విడతకు సంబంధించి రూ.6 వేలు రావాల్సి ఉంది.

- కుర్మేడు గ్రామంలో 130, కుర్రంపల్లిలో 130 మందికి రెండు విడతలకు సంబంధించి బిల్లులు రావాల్సి ఉంది.
- వెంకటంపేట, నసర్లపల్లి గ్రామాల్లో మరుగుదొడ్డి నిర్మించుకోని వారి పేరిట బిల్లులు స్వాహా చేయగా మరుగుదొడ్డి నిర్మించుకున్న వారికి మాత్రం బిల్లులు అందించలేదు.
- నెల్వలపల్లి, ఉప్పరపల్లి, గడియగౌరారం, మల్లారెడ్డిపల్లి, హోమంతాలపల్లి, వింజమూరు గ్రామాల్లో కూడా లబ్ధిదారులకు బిల్లులు అందాల్సి ఉంది.



సూర్యాపేటలో ఉపాధ్యాయులకు నోట్ బుక్స్ అందజేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

సార్.. నోట్ బుక్స్ కావాలే!

- పాఠశాలలు ప్రారంభమై 15 రోజులైనా అందని కాపీలు
- ప్రభుత్వం మొదటిసారిగా నిర్ణయం తీసుకున్నా సరఫరాలో జాప్యం
- ఉమ్మడి జిల్లాకు కావాల్సినవి 11,84,048.. వచ్చినవి 3,69,975
- నోట్ పుస్తకాలు లేకపోవడంతో విద్యార్థుల ఇబ్బందులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ ఉచితంగా అందించాలని ఈసారి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ, వాటిని విద్యార్థులకు అందించడంలో జాప్యం జరుగుతోంది. పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా ఉమ్మడి జిల్లాలో 5 శాతం మంది విద్యార్థులకు కూడా నోట్‌బుక్స్ అందలేదు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు వర్క్ బుక్స్ ఇస్తామని చెప్పినా అవి కూడా ఇంతవరకు రాలేదు. ఇక, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు నోట్‌బుక్స్ ఇస్తామని చెప్పగా, వాటిని కొనుగోలు చేసి సరఫరా చేయడంలో జాప్యం జరుగుతోంది. దీంతో విద్యార్థులందరికి నోట్ బుక్స్ లేకుండా పోయాయి. కొద్దిగా స్తోమత కలిగిన వారు నోట్ బుక్స్ కొనుగోలు చేసుకుంటున్నారు. పేద విద్యార్థులకు మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు.

కావాల్సినవి.. వచ్చినవి!

- నల్లగొండ జిల్లాలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులు 52,909 మంది ఉండగా వారందరికి వర్క్ బుక్స్ రావాల్సి ఉంది. ఇక, 6వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు 40,632 మంది ఉన్నారు. వారికి 5,47,890 నోట్ బుక్స్ అవసరమని విద్యాశాఖ తేల్చింది. అందులో 200 పేజీల లాంగ్ నోట్ బుక్స్ (సింగిల్ రూల్) 86,295 రావాల్సి ఉండగా 6,300 వచ్చాయి. 200 పేజీల లాంగ్ నోట్ బుక్ (ప్లెయిన్) 4,61,595 రావాల్సి ఉండగా 1,20,575 వచ్చాయి. మొత్తంగా ఇప్పటివరకు జిల్లాకు 23.16 శాతం నోట్ బుక్స్ అందాయి.
- యాదాద్రి భువనగిరి జిల్లాలో 28,886 మంది విద్యార్థులకు 3,08,558 నోట్ బుక్స్ రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 95,100 నోట్ బుక్స్ వచ్చాయి. వాటన్నింటినీ పాఠశాలలకు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.
- సూర్యాపేట జిల్లాలో 31,205 మంది విద్యార్థులకు 3,27,600 నోట్ బుక్స్ రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 1.48 లక్షల నోట్ బుక్స్ వచ్చాయి. వాటిని పాఠశాలలకు పంపించామని అధికారులు పేర్కొంటున్నారు.

త్వరగా ఇవ్వాలని కోరుతున్న తల్లిదండ్రులు

పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు గడిచిన నేపథ్యంలో ప్రభుత్వం నోట్ బుక్స్ త్వరగా పంపిణీ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈసారి ప్రభుత్వమే నోట్ బుక్స్ ఇస్తుందని టీచర్లు చెప్పడంతో చాలా మంది నిరుపేద కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు వాటిని కొనుగోలు చేయలేదు. దీంతో పాఠశాలల్లో ఉపాధ్యాయులు హోం వర్క్ ఇచ్చినా నోట్‌బుక్స్ లేక రాసుకోలేని పరిస్థితి నెలకొంది.

వచ్చిన వాటిని స్కూళ్లకు పంపించాం



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేసే ఉత్తర్వులను ఈనెల 6వ తేదీనే విద్యాశాఖ జారీ చేసింది. దాని ప్రకారం వెంటనే నోట్ బుక్స్ సరఫరా చేసేలా చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు ప్రభుత్వం పంపించిన నోట్‌బుక్స్‌ను పాఠశాలలకు పంపించాం. మిగితావి రాగానే విద్యార్థులకు అందించేలా చర్యలు చేపడతాం.

– భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

తరగతి వారీగా విద్యార్థులు..

తరగతి	నల్లగొండ	యాదాద్రి	సూర్యాపేట
6	7,614	5,420	6,143
7	9,188	6,129	6,379
8	7,973	5,757	6,684
9	8,072	5,968	6,080
10	7,785	5,612	5,920
మొత్తం	40,632	28,886	31,205

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ : ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 13వ తేదీ నాటికి డబల్ ఓటర్లు, చనిపోయిన వారిని తొలగించిన ఓటర్ జాబితాను సిద్ధం చేయాలన్నారు. ప్రతి బీఎల్ఓ దగ్గర కొత్తగా రూపొందించిన ఓటరు జాబితాతోపాటు బీఎల్ఓ రిజిస్టర్ అందుబాటులో ఉండాలన్నారు. ఈఆర్ఓ నెట్ ఆన్‌లైన్ సేవలు జూలై 13వ వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని.. అప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించుకోవాలని సూచించారు. ఓటర్ జాబితాలో ట్రాన్స్ జెండర్లు ఎంత మంది ఉన్నారో పరిశీలించి మార్క్ చేయాలన్నారు. తహసీల్దార్లు పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులను పరిశీలించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలు రేషనలైజేషన్ నిబంధనలను అనుసరించి.. ఒక కుటుంబంలో వారు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా జాబితా ఉండాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఓ కాళిందిని, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

మిర్యాలగూడ : గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పూర్తి చేయాలని డీఆర్‌డీఓ కాళిందిని అధికారులను ఆదేశించారు. దామరచర్ల మండల కేంద్రంలో చేపడుతున్న పనులను ఆమె పరిశీలించారు. కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడారు. వాడపల్లిలోని పల్లెప్రకృతివనం, కంపోస్ట్ షెడ్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జానయ్య, ఎంపీఓ మోసిన్‌అహ్మద్, ఏపీఓ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



కంపోస్ట్ షెడ్డును పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

రైతులకు న్యాయ సహాయం అందిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బి.దీప్తి


మునుగోడు : పంటల సాగులో విత్తనాలు, ఎరువుల కారణంగా నష్టపోయిన రైతులు న్యాయసేవా సదన్‌ను ఆశ్రయిస్తే తగిన న్యాయ సహాయం అందిస్తామని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.దీప్తి పేర్కొన్నారు. మునుగోడు రైతు వేదికలో మంగళవారం రైతు చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లు చేసినప్పుడు విధిగా రశీదులు తీసుకోవాలన్నారు. ఆ విత్తనాలు, ఎరువుల వల్ల రైతుకు నష్టం జరిగితే వాటిని విక్రయించిన యజమాని నుంచి పరిహారం అందేలా న్యాయశాఖ చొరవ చూపుతుందని తెలిపారు. మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో తమ సంస్థ ప్రతినిధులు అందుబాటులో ఉంటారని, రైతులకు భూ, ఇతర సమస్యలు ఉంటే వారిని సంప్రదించాలని సూచించారు.

హాస్టళ్లలో ఏఎన్‌ఎం పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో 2023–24 సంవత్సరానికి 42 ఏఎన్‌ఎం పోస్టుల కోసం ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఇంటర్ ఉత్తీర్ణులై, ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థలో 18 నెలల ఏఎన్‌ఎం శిక్షణలో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. గిరిజన విద్యా సంస్థల్లో పనిచేసిన అనుభవం కలిగిన వారికి 20% వెయిటేజీ ఉంటుందని.. ఒక సంవత్సరానికి 5% చొప్పున, గరిష్టంగా 4 సంవత్సరాలకు వెయిటేజీ ఇస్తామని తెలిపారు. అర్హత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఎంపికైన వారికి వేతనంగా నెలకు రూ.22,750 ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా చెల్లించనున్నట్లు తెలిపారు. గిరిజన బాలికల పాఠశాలలో పోస్టులకు కేవలం మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హతగల అభ్యర్థులు http//tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో తమ దరఖాస్తును జూలై 3 నుంచి జూలై 13లోపు సమర్పించాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 98853 85580, 95151 81080 నంబర్లకు ఫోన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేరాల నియంత్రణకు కఠిన చర్యలు

- ఎస్పీ అపూర్వరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : జిల్లాలో నేర నియంత్రణ, మహిళ రక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అపూర్వరావు పేర్కొన్నారు. డీజీపీ అంజనీకుమార్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరాల నియంత్రణ, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి ఎస్పీ అపూర్వరావు మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని.. దోపిడీలు, దొంగతనాలు జరగకుండా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని వివరించారు. పెండింగ్ కేసుల్లో నేరస్తులు తప్పించుకోకుండా తగిన ఆధారాలను కోర్టుకు అందజేసి శిక్ష పడేలా చూస్తున్నామన్నారు. డయల్ 100కు తక్షణమే స్పందిస్తున్నామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనీ ఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఏఎస్పీ వరప్రసాద్, డీఎస్పీ నర్సింహారెడ్డి, నాగేశ్వర్‌రావు, రమేష్ పాల్గొన్నారు.

జూలై 4న వాహనాల వేలం

జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో తగిన ఆధారాలు లేకుండా ఉన్న వాహనాలను జూలై 4వ తేదీన జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో వేలం వేయనున్నట్లు ఎస్పీ అపూర్వరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 96 టూవీలర్స్, 17 త్రీవీలర్స్, 5 కార్లను బహిరంగ వేలం వేస్తున్నట్లు వెల్లడించారు. వాహన యజమానులు ఎవరైనా ఉంటే తగిన ఆధారాలు తీసుకొచ్చి వాహనాలను తీసుకుపోవాలని సూచించారు. వేలంలో వాహనాలు పొందిన వారు వెంటనే డబ్బులు చెల్లించి వాహనాలు తీసుకుపోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94949 98805 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నోటీసులిచ్చారు.. చర్యలు మరిచారు!

- చండూరు మున్సిపాలిటీలో జోరుగా అక్రమ నిర్మాణాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- పేదలకే వర్తిస్తున్న నిబంధనలు



చండూరు పట్టణంలో ప్రధాన సెంటర్

» చండూరు పట్టణంలో కేంద్రంలో అనుమతి లేకుండా ఓ భవన నిర్మాణం చేపట్టారు. దీనిపై మున్సిపల్ అధికారులకు ఓ నాయకుడు ఫిర్యాదు చేశాడు. అధికారులు నిర్మాణదారుడికి ముందుగా నోటీసులు ఇచ్చారు. చర్యలు తీసుకుంటామని చెప్పేలోపే (ఏడాది సమయంలో) ఆ భవన నిర్మాణం పూర్తయింది.

» పట్టణంలో ఓ వ్యక్తి అనుమతి లేకుండా మూడు ఫ్లోర్‌ల ఇంటి నిర్మాణం చేపట్టాడు. అక్రమ నిర్మాణం చేపడుతున్నారని కౌన్సిలర్లు అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

» ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరి గోడ ముందు అనుమతి లేకుండా రెండు విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారని పట్టణ వాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వారికి అధికారులు నోటీసులు ఇచ్చి వదిలేశారు.

చండూరు : చండూరు మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలు అడ్డూ అదుపు లేకుండా సాగుతున్నాయి. పట్టణంలోని సెంటర్ నుంచి రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సముదాయాలు మొదలుకుని పెద్ద భవనాలు, ఆస్పత్రులు, ఫంక్షన్ హాళ్లు ఇలా చాలా వరకు అనుమతి లేని నిర్మాణాలే. అక్రమ నిర్మాణం చేసుకునే వారికి నోటీలిస్తున్న అధికారులు వారిపై చర్యలకు మాత్రం వెనుకాడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో పలుకుబడి ఉన్న వారు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేసుకుంటూ ముందుకు సాగుతుంటే.. పేదలకు మాత్రం అనుమతులు అడుగుతూ అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

100 వరకు అక్రమ నిర్మాణాలు..

చండూరు మున్సిపాలిటీ పరిధిలో సుమారు 100 ఇళ్ల వరకు అనుమతిలేనివిగా అధికారులు గుర్తించారు. వీరికి గతంలో నోటీసులు సైతం అందజేసి.. చర్యలు తీసుకోవడం మరిచారు. అధికారులు గుర్తించనవి మరో వంద వరకు ఉంటాయని కౌన్సిలర్లే చెప్తున్నారు. అధికారులు నోటీసులు ఇవ్వడం తప్ప చర్యలు తీసుకోకపోవడంతో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని పట్టణవాసులు అంటున్నారు.

టాస్క్‌ఫోర్స్‌కు ఫిర్యాదు చేస్తున్నాం



చండూరు మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలను గుర్తించి, వాటి యజమానులకు నోటీసులు అందించాం. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై తదుపరి చర్యలకు జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నాం. అక్రమ నిర్మాణాలపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– మొయిజుద్దీన్, కమిషనర్, చండూరు మున్సిపాలిటీ

నిబంధనలు ఇలా..

తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అత్యంత సౌకర్యవంతంగా, సులభంగా నిర్మాణ అనుమతులు ఇవ్వడం కోసం బీఎస్ బీపాస్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో ముందుగా అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఆ తర్వాత రెవెన్యూ ఆర్ఐ లాగిన్ వెళ్తే ఆర్ఐ క్షేత్రస్థాయిలో విచారణ చేసి టౌన్ ప్లానింగ్ సెక్షన్ (టీపీఎస్)కు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అన్ని రకాల డాక్యుమెంట్లు సరిగ్గా ఉంటే టీపీఎస్ నుంచి నేరుగా అనుమతులు ఇస్తారు. అనుమతుల కోసం ఇంటి గజాలను బట్టి ఆన్‌లైన్‌లో నగదు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇలా అనుమతుల ప్రక్రియ పట్టణంలో సాగడం లేదు.

క్లుప్తంగా

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

చిట్యాల : మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని మెప్మా పీడీ కరుణాకర్ అన్నారు. చిట్యాల మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు బ్యాంకులు, సంఘాల ద్వారా రుణాలు పొందడం, సంఘాల్లో అంతర్గత రుణాలు పొందడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, డీఎంసీ శివాజీ, టీఎంసీ సరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజా పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నకిరేకల్ : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు తెలిపారు. అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

కేతేపల్లి : మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో మందిరంలో నిర్వహించనున్న సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్‌పర్సన్‌గా సరిత



చిట్యాల : ఆరెగూడెం గ్రామ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. చైర్‌పర్సన్‌గా మురాల సరిత ఎన్నికయ్యారు. సంఘం డైరెక్టర్లుగా బైరుకొండ పద్మ, నాగులగాని అండమ్మ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అర్రూరి లాలమ్మ, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు గుండె రమేష్, పత్రాప్‌రెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.

డైరెక్టర్లకు సన్మానం

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామంలో రెండురోజుల క్రితం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం పరిధిలో మూడు డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో రెండు డైరెక్టర్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించింది. గెలుపొందిన డైరెక్టర్లను మంగళవారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి టీ పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గెలుపొందిన డైరెక్టర్లు జాల భిక్షం, దొంగరి నాగరాజులతోపాటూ కాంగ్రెస్‌పార్టీ మద్దతుతో నూతనంగా ఎన్నికైన చైర్మన్ ఎర్ర శంభులింగారెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, ఇటుకులపహాడ్, ఆకారం సర్పంచ్‌లు అల్లి సైదులు, కందాల సమరంరెడ్డి, మాధారంకలాన్ ఎంపీటీసీ నోముల జనార్దన్, పాదూరి శంకర్‌రెడ్డి, భూపతి అంజయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని బర్కత్‌పురలో పండ్ల కంపెనీ స్టోరేజ్‌లో ఏసీ గ్యాస్ సిలిండర్ పేలి మృతి చెందిన షేక్ సలీం, అందులో పనిచేసే వర్కర్ సాజిద్ కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి మృతుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున పంపిన లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎండీ. బషీరుద్దీన్, హన్ను, ఐతగాని స్వామిగౌడ్, దుబ్బ అశోక్‌సుందర్, కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

నేడు జాతీయ హార్టికల్చర్ పథకాలపై అవగాహన

కట్టంగూర్ : జాతీయ హార్టికల్చర్ పథకాలపై అయిటిపాముల గ్రామం గంగదేవిగూడెం సమీపంలో ఉన్న కట్టంగూర్ రైతు ఉత్పత్తిదారుల సంఘం భవనంలో బుధవారం అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు హార్టికల్చర్ నియోజకవర్గ అధికారి రావుల విద్యాసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిమ్మ, బత్తాయి, మామిడి, ఆయిల్‌పాం రైతులు సాగులో పాటించాల్సిన పద్ధతులు, లింగాకర్షణ బుట్టలు అమర్చే విధానంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలి

మాడుగులపల్లి : రెండో విడత గొర్రెల పంపిణీని ప్రభుత్వం వేగవంతం చేయాలని గొర్రెల పెంపకందారుల సహకార సంఘం మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు ఊరిబండి శ్రీనివాస్ యాదవ్ కోరారు. కుక్కడం గ్రామంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన వెంట నాగరాజు, మల్లికార్జున్, సైదులు, శంకర్ యాదవ్, తదితరులు ఉన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణించేదెలా !

- అధ్వానంగా బుడుమర్లపల్లి ప్రధాన రహదారి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని పాలకులు

కనగల్ : మండల పరిధిలోని బుడుమర్లపల్లి గ్రామ ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి వాహనదారులు నరకం చూస్తున్నారు. కనగల్ మండల కేంద్రం నుంచి మాల్, హైదరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం మరమ్మతులు అయినా చేపట్టాలని కోరుతున్నారు. జియడవల్లి పాత చెరువు నుంచి వచ్చే పారుగంత కాలువ నీరు ఈ ప్రాంతంలో ప్రవహించి మురుగు కాలువ తక్కువ పరిణామంలో ఉండడంతో రోడ్డు పైకి వచ్చి రోడ్డు పూర్తిగా దెబ్బతింటోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఆరేళ్లుగా ఇదే సమస్య ఉన్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బుడుమర్లపల్లి గ్రామంలో అధ్వానంగా ఉన్న చండూరు-మాల్ ప్రధాన రహదారి

ఇక్కట్లు పడుతున్న వాహనదారులు..

అధ్వానంగా తయారైన ఈ రోడ్డుపై వాహనదారులు ప్రయాణించాలంటే నానా ఇక్కట్లు పడుతున్నారు. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి అందులో వర్షపు నీరు నిలిచి ప్రమాదకరంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుకుంటూ వెళ్తున్నారు. ఇటీవల ఇద్దరు వ్యక్తులు ఈ ప్రాంతంలో పడడంతో స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఇప్పటికే చాలామంది ఈ గుంతల్లో పడి గాయాలపాలైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలిచి ప్రమాదకంగా ఉందని ఈఈ, డీఈ, ఏఈల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. నా సొంత ఖర్చులతో ఇప్పటికే 7మార్లు కంకర, మట్టి పోయించా. వర్షం వచ్చిన ప్రతిసారి కొట్టుకుపోతోంది. ఈ వర్షాకాలం వరకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి.

–కారింగు జానయ్య, మాజీ సర్పంచ్, బుడుమర్లపల్లి

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు

కనగల్ క్రాస్‌రోడ్డు నుంచి బచ్చన్నగూడెం వరకు రూ. 2.1కోట్లతో నూతన బీటీ రోడ్డు మంజూరు అయింది. ఇప్పటి వరకు 9మార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతోనే పనుల్లో జాప్యం జరుగుతోంది. రోడ్డు పనుల్లో భాగంగా మురుగు కాలువలు, సీసీ రోడ్లు, కల్వర్టులు నిర్మించాల్సి ఉంటుంది.

–దినేష్‌రెడ్డి, ఏఈ

బక్రీద్ పండుగ ఏర్పాట్లు పూర్తి చేయాలి

నల్లగొండ టూటౌన్ : బక్రీద్ పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని మునుగోడు రోడ్డులో గల ఈద్గాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండగకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. తాగు నీరు, టెంట్లు, మైకులు ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని మజీద్‌ల వద్ద మౌలిక సదుపాయాలు, శానిటేషన్ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏసీపీ నాగిరెడ్డి, డీఈ నరసింహారెడ్డి, ఏఈ ప్రవీణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మూర్తుజా అలీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

పాత బస్తీ ప్రాంతంలో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి ఆదేశించారు. పాతబస్తీలో డ్రెయినేజీ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీ, రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ రమణాచారి

నీట మునుగుతున్న సొనబండ



సొనబండలో ఇళ్లలోకి చేరిన వరద నీరు (ఫైల్)

మునుగోడు : చిన్నపాటి వర్షం కురిస్తే చాలు మునుగోడు గ్రామ పరిధిలోని ఆవాస గ్రామం సొనబండ నీట మునిగిపోతోంది. గ్రామానికి పైభాగంలో వ్యవసాయ భూముల్లోని వరద నీరు ఇళ్లల్లోకి వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సొనబండ గ్రామ పరిధిలోని రైతులు తమ భూమి చుట్టూ ఎత్తుగా వరద కట్టలు పోసుకున్నారు. దీంతో ఆ నీరు ఎటూ వెళ్లే దారి లేక గ్రామంలోకి వచ్చి చేరుతోంది. దీంతో ఆ గ్రామంలోని దాదాపు 70 ఇళ్లల్లో నివాసం ఉండే 250 మంది ప్రజలు చిన్నపాటి వర్షం వస్తే చాలు తమ ఇంటి నుంచి బయటకు వచ్చి నిలబడుతున్నారు. గతంలో వర్షం వచ్చినప్పుడు నీరు వీధుల్లో నిలిచేది. ప్రస్తుతం నీరంతా రోడ్డుపై పారడంతోపాటు ఇళ్లలోకి చేరి వర్షం వచ్చిన రోజు ఆ గ్రామం ఓ కుంటను తలపిస్తోంది. మోకాళ్ల లోతు నీరు వస్తుండడంతో ఇళ్లలోని సామగ్రి తడిసిముద్దవుతోంది. అంతే కాకుండా రోడ్డు వెంట రాకపోకలు జరపలేని పరిస్థితి నెలకొంది. ఇళ్లల్లోకి నీరు చేరుతుండడంతో తమ ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. గ్రామంలోకి నీరు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు, పంచాయతీరాజ్ అధికారులకు గ్రామస్తులు వినతి పత్రాలు అందించినా స్పందన లేదు. సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు స్పందించి గ్రామంలోకి నీరు రాకుండా చేయాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పేదల అభ్యున్నతికి కేంద్రం కృషి

కేతేపల్లి : పేద ప్రజల అభ్యున్నతి కోసం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేపూరి రవీందర్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బొప్పారం గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను బీజేపీ నాయకులు ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తన పథకాలుగా ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు అయితగోని అనిత, జటంగి రాంచంద్రయ్య, చెరుకు రోషయ్య, వి.నాగయ్య, వెంకటమ్మ, రాచకొండ శ్రీనివాస్, కుంభం శ్రీకాంత్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలి

నకిరేకల్ : గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర నేత శేపూరి రవీందర్ పిలుపునిచ్చారు. నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుడుగుంట్ల సాయన్న, బుడిగె సైదులు, పాలడుగు రమేష్, పల్లపు బుద్ధుడు చెనగాని రాములు, గుంటోజు లక్ష్మీ, కల్యాణ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



కేతేపల్లి : బొప్పారంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

చిట్యాల : వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ చిట్యాలలో మంగళవారం సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ జిల్లా అధికారి నాగిరెడ్డికి వయో వృద్ధుల సంఘం అధ్యక్షుడు పామనగుల్ల అచ్చాలు వినతిపత్రం అందజేశారు. అనంతరం చిట్యాల తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ముత్తలింగం, కంచర్ల శంకర్‌రెడ్డి, వడ్డెపల్లి ఎల్లయ్య, సత్తయ్య, పెంటయ్య, జహంగీర్, భిక్షపతి, పెంటయ్య పాల్గొన్నారు.

అక్రమంగా కుంట మట్టి తరలింపు



పుల్లాయి కుంట కట్ట వద్ద తవ్విన మట్టి



ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న మట్టి

చండూరు : చండూరు మండలంలోని తాస్కానిగూడెం గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ఓ ఫంక్షన్ హాల్‌కు ఇదే గ్రామానికి చెందిన ఓ ప్రజా ప్రతినిధి మున్సిపల్ పరిధిలోని పుల్లాయికుంట నుంచి అక్రమంగా రెండు రోజులుగా ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. మంగళవారం మట్టి తరలింపును కొంతమంది గమనించి అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్రమార్కులు జేసీబీ, ట్రాక్టర్లను హడావుడిగా అక్కడి నుంచి తీసుకెళ్లారు.

పోలీసులకు ఫిర్యాదు

కుంటలోని మట్టిని అనుమతి లేకుండా ట్రాక్టర్ల ద్వారా తరలించడంపై ఐబీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కుంటలోకి వరద కాలువ ద్వారా నీటిని మళ్లించేందుకు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఓవైపు కృషి చేస్తుండగా, మరోవైపు అక్రమంగా కుంటను తవ్వడం పై రైతులు కూడా అసహనానికి గురవుతున్నారు. ఈ విషయమై ఐబీ డీఈ ఖాసీం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఈ తెలిపారు. ప్రజాప్రతినిధి వివరణ ఇస్తూ మట్టి తరలింపు విషయంలో తనకు సంబంధం లేదని, ఫంక్షన్ హాల్ నిర్మాణానికి మట్టి పోయాలని ట్రాక్టర్ల యాజమానులకు చెప్పానని.. కానీ వారు కుంటలోని మట్టి తెచ్చారని తనకు తెలియదని పేర్కొన్నారు.

తులసీచంద్‌పై బెదిరింపులను ఖండించాలి

మర్రిగూడ : జర్నలిస్టు, సామాజిక విశ్లేషకురాలు తులసీచంద్‌కు ఫోన్ చేసి చంపుతామని బెదిరిస్తున్న వారి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. మంగళవారం స్థానికంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుగా మతోన్మాదం, అరాచకాలను ప్రశ్నిస్తూ దేశంలో శాంతి, మతసామరస్యాలను పెంపొందించాలన్న ధృడ సంకల్పంతో సామాజిక మాధ్యమాల్లో విశ్లేషనలు చేస్తున్న తులసీచంద్‌ను బెదిరించడం అప్రజాస్వామికమన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులు అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

కనగల్ : దర్వేశిపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన కంచరకుంట్ల చంద్రశేఖర్‌రెడ్డి(చిన్న) మంగళవారం స్కూల్ బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంపీటీసీ నకిరేకంటి శైలజసైదులు, కూసం ఉపేందర్‌రెడ్డి, పాలకూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు సత్కారం



సత్తయ్యను సన్మానిస్తున్న జ్యోతి

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన దండంపల్లి సత్తయ్య ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మూడు నెలల క్రితం విజయవాడ–హైదరాబాద్ వైపు వెళ్లే గరుడ ఆర్టీసీ బస్సు నడుపుతుండగా మార్గమధ్యలో రామోజీ ఫిలిం సిటీ సమీపంలోకి వెళ్లేసరికి ఆ బస్సులోని ఓ వృద్ధురాలు పిడుగురాళ్లకు చెందిన పార్వతి గుండె పోటుకు గురయింది. గమనించిన డ్రైవర్ సత్తయ్య సకాలంలో 108కి కాల్ చేసి అంబులెన్స్‌లో ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించడంతోపాటు బాధిత మహిళ కూతురు జ్యోతికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. అనంతరం ఆ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా మృతి చెందిన వృద్ధురాలు పార్వతి కూతురు జ్యోతి మంగళవారం ఉరుమడ్ల గ్రామంలోని డ్రైవర్ సత్తయ్య ఇంటికి వచ్చి శాలువాతో సత్కరించి కృతజ్ఞత చాటింది. అంతేకాకుండా కొంత నగదుతో పాటు, ప్రెషర్ కుక్కర్ అందజేసింది.

రైతులకు అవగాహన

కట్టంగూర్ : విత్తన ఉత్పత్తిలో రైతులు జాగ్రత్తలు పాటించాలని తెలంగాణ స్టేట్ సీడ్ కార్పొరేషన్ డీఎం కృష్ణవేణి అన్నారు. మంగళవారం మండలంలోని అయిటిపాముల గ్రామం రైతు వేదికలో విత్తన ఉత్పత్తి, పచ్చిరొట్ట సాగుపై రైతులకు నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విత్తన ఉత్పత్తిపై రైతులకు మెళకువలు సూచనలు చేశారు. ఆసక్తి గల రైతులకు కార్పొరేషన్ ద్వారా విత్తనాలు సరఫరా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, ఏఓ శ్రీనివాస్, ఏఈఓ రమణ పాల్గొన్నారు.



పచ్చిరొట్టను పరిశీలిస్తున్న డీఎం కృష్ణవేణి

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు



కట్టంగూర్ : ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఏపీజీవీబీ మేనేజర్ సైదారెడ్డి



తిప్పర్తి మోడల్ స్కూల్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై మండల స్థాయి ఆలిండియా క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు పాల్గొన్నారు. టీఎస్ మోడల్ స్కూల్ ప్రథమ బహుమతి రూ. 5 వేలు, రెండో బహుమతి జెడ్పీ బాలుర పాఠశాల తిప్పర్తి రూ. 4 వేలు, మూడో బహుమతి ఇందుగుల పాఠశాల విద్యార్థులు రూ. 3 వేలు గెలుపొందారు. మండల స్థాయి విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిప్పర్తి ఏపీజీవీబీ మేనేజర్ దివ్యభారతి, సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్ రావులపాటి రమేష్ పాల్గొన్నారు.

చిట్యాల : పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో విద్యార్థులకు భారత దేశ ఆర్థిక వ్యవస్థ అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నేరడ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు కర్నాటి శృతి, పొట్టబత్తిని ఫణిశ్రీ మొదటి బహుమతి ఐదు వేల రూపాయల నగదు, వెలిమినేడు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు తాటికొండ మానస, రామోజు కార్తీక్ ద్వితీయ బహుమతి నాలుగు వేల రూపాయలు, చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు దాసరి యశ్వంత్, పొలాస శ్రీవిద్య తృతీయ బహుమతి మూడు వేల రూపాయల నగదును గెలుపొందారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గోగికార్ మాధవి, కెనరా బ్యాంకు మేనేజర్ గడ్డం సోమేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్రిగూడ : చింతపల్లి ఎస్‌బీఐ, ఏపీజీవీబీ అధికారులు మర్రిగూడ, చింతపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై క్విజ్, రాత పరీక్ష నిర్వహించారు. మొదటి స్థానంలో మర్రిగూడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు, దామెరభీమనపల్లి విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానంలో మర్రిగూడ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు గెలుపొందారు. క్విజ్ పోటీల్లో రాణించిన విద్యార్థినులను ఉపాధ్యాయులు కె.కృష్ణారెడ్డి, పరమేశ్వరి, వెంకటేశ్వర్లుతోపాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కేజీబీవీ విద్యార్థులు పి. ప్రేక్షశ్రీ, జి భారతి ప్రథమ బహుమతి, కట్టంగూర్ హైస్కూల్‌కు చెందిన వై తారశ్రీ, వి. పంచశ్రీ ద్వితీయ, ఈదులూరు హైస్కూల్‌కు చెందిన వాగ్దేవి, సరస్వతి తృతీయ బహుమతి గెలుచుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు కట్టంగూర్ ఏపీజీవీబీ మేనేజర్ బి.సైదారెడ్డి ప్రశంసా పత్రాలు, నగదు అందజేశారు. హెచ్‌ఎం రంగరాజు జ్యోతి, ఉపాధ్యాయులు, బాలరాజు, ప్రశాంతి, గఫూర్, సీఆర్‌పీ రవికుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలం



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

మునుగోడు : ఉప ఎన్నిక సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందోజు శంకరాచారి ఆరోపించారు. మండలంలోని సోలిపురం గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడంతో మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో ఆ వాగులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ హామీలను ఓ పేపర్‌పై రాసి వాటిని వాగు నీటిలో వదిలి నిరసన తెలిపారు. అనంతరం శంకరాచారి మాట్లాడుతూ ఉప ఎన్నిక సందర్భంగా అనేక మాయమాటలు చెప్పి గెలిచిన బీఆర్‌ఎస్ పార్టీ.. నేడు నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా సోలిపురం గ్రామానికి వెళ్లే వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పందుల సురేష్, కత్తుల పద్మ, గుండెపాక నర్సింహ, ఇరుగు వెంకటయ్య, యాదయ్య, వర్గాల సైదులు, బలం నర్సింహ, ఇరిగి రమేష్, బాలం లక్ష్మమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు, ఇళ్లు ఇవ్వాలి

నల్లగొండ రూరల్ : అర్హులైన పేదలందరికీ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నల్లగొండ తహసీల్దార్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గృహలక్ష్మి పథకానికి రూ.5 లక్షల నగదు పెంచాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సీఐటీయూ నాయకులు హాషం, నాగార్జున, సత్తయ్య, పద్మ, సరోజ తదితరులు ఉన్నారు.

కనగల్ : అర్హులందరికీ ఇంటి స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు ఇవ్వాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపి తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల నాయకులు ఎండీ అక్రం, సుల్తానా, రాంబాబు, సాయమ్మ, సమ్రీన్, రాధిక, ధనమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



కనగల్ : వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

జూలై 3న కలెక్టరేట్ ముట్టడి



నార్కట్‌పల్లి : మాట్లాడుతున్న వీరారెడ్డి

నార్కట్‌పల్లి : అర్హులైన ప్రజలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూలై 3న ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జిట్టా నాగేష్, అవిశెట్టి శంకరయ్య, పెంజర్ల సైదులు, మండల కార్యదర్శులు చెరుకు పెద్దులు, అలూరి శ్రీను, రామస్వామి, నారబోయిన ఎను, లింగస్వామి, రాజయ్య, బయ్యన్న, కొప్పు శ్రవణ్, రవి, సత్తయ్య, శ్రీను, మోహన్, రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

చండూరు : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూలై 3న కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం కోరారు. మంగళవారం చండూరులో సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మోగుదాల వెంకటేశం, కొత్తపల్లి నరసింహ, చిట్టిమల్ల లింగయ్య, గౌసియా బేగం పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

శాలిగౌరారం : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో విత్తనాలు, ఎరువులు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని సంఘం చైర్మన్ తాళ్ళూరి మురళి తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరి విత్తనాల్లో బీపీటీ-5204 రకం (25 కిలోలు) రూ.885లు, ఎంటీయూ-1010 రకం(25 కిలోలు) రూ.885లు, కేఎన్‌ఎం-118 రకం(25 కిలోలు) రూ.885లు, జీలుగు(30 కిలోలు) రూ.845లు ఉన్నాయన్నారు. అదేవిధంగా ఎరువుల్లో యూరియా రూ. 265, 20.20.0.13 రూ.1150, డీఏపీ రూ.1350 ఉన్నట్లు వివరించారు. ఆయన వెంట సంఘం సీఈఓ నిమ్మల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

నల్లగొండ : మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డా.లలితకుమారి అన్నారు. మంగళవారం గంధవారిగూడెం ప్రభుత్వ గురుకుల కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పావని, కల్పన, పద్మ, మానస తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



విద్యార్థి పుస్తక పఠనాన్ని పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి వీరేంద్రకుమార్

చిట్యాల : పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ముత్యాలమ్మగూడెంలోని ప్రాథమిక పాఠశాల, భవిత విద్యావనరుల కేంద్రాన్ని మంగళవారం సెక్టోరియల్ అధికారి రావిరాల వీరేంద్రకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠనం తీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాల్లో ఎలాంటి సందేహాలు వచ్చినా వెంటనే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గోలి స్లీవమ్మ, ఉపాధ్యాయులు బాదం భిక్షపతి, వనజ, భవిత కేంద్రం ఉపాధ్యాయులు బోయ శ్రీనివాసులు, ఆవుల గీత, సీఆర్‌పీ జయకాంత్ పాల్గొన్నారు.

ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాయోజన నగదు అందజేత

శాలిగౌరారం : ఇటీవల మృతిచెందిన మనిమద్దె గ్రామానికి చెందిన పజ్జూరి మంగమ్మకు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాయోజన కింద మంజూరైన రూ.2 లక్షల నగదును మంగమ్మ తల్లి పిచ్చమ్మకు మండల కేంద్రంలోని ఏపీజీవీబీ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం అందజేశారు. ఏపీజీవీబీలో ఖాతా కలిగిన మంగమ్మ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాయోజన కింద రూ.330 చెల్లించింది. అకస్మాత్తుగా ఆమె మృతిచెందడంతో వచ్చిన బీమా సొమ్మును బాధిత కుటుంబానికి అందజేసినట్లు బ్యాంకు మేనేజర్ తెలిపారు.